Subscriber's Copy.



# విలువ

రచన: "విశ్వమిత్ర"

అలారం మోత విని లేచిన సత్యం, నిరీక్షణరావుని వీపుమీద రెండంటించి నిద్రలేపాడు.

బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ గడియారంవంక కోపంగాచూసి, తప్పని సరిగా, అతి ప్రయత్నంమీద పక్క మీద లేచికూర్చున్నాడు నిరీక్షణరావు.

చిందరవందరగా పడేసివున్న పుస్తకాలు ఎగతాళిగా చూస్తున్నట్లనిపించి వొళ్లు మండింది నిరీక్షణరావుకి.

అరనిమిషంసేపు మనసులో ప్రార్థన జరుపుకొన్నమీదట నిరీక్షణరావు అమాంతం లేచి నుంచున్నాడు. వీడి వాలకం సత్యానికి కొత్తకాదు కనక వాడి పనేదో వాడు చూసుకుంటు న్నాడు.

గట్టిగా ఒక్కసారి ఆవులించి, వొళ్లు పెళ పెళా విరుచుకొని,

‘సత్యం-లే!’అన్నాడు నిరీక్షణరావు. రోడ్డుమీదపోయే సినిమాజనం మాటలు అస్పష్టంగా వినబడుతున్నయ్.

‘అదిగో రెండో ఆట సినిమా వొది లారు. త్వరగా లే!’ అన్నాడు మళ్లీ నిరీక్షణరావు.

గదికి తాళంవేసి ఇద్దరూ బైటికి బైల్దేరారు.

దోవనపోయేవాళ్లదగ్గర నిప్పు అప్పుచ్చుకుని సిగరెట్ ముట్టించాడు నిరీక్షణరావు.

ముందుకు నడిచే సత్యంకాళ్లను నిరీక్షణరావు కాళ్లుకూడా అనుసరించాయి.

‘నాకో చిన్న సలహా ఇవ్వాలి’ అన్నాడు క్లుప్తంగా నిరీక్షరావు వెళ్తూ వెళ్తూ.

‘ఏమిటది?’ అన్నాడు సత్యం, బహుశా అదేదో పరీక్షల్ని గురించే ఐవుంటుందని. వెంటనే జవాబు రాక పోవటంవల్ల సత్యం మళ్లీ ‘పరీక్షల విషయంలో నేనా? అన్నాడు.

‘అబ్బె! కాథవపరీక్షలు—అది కాదు.’ ఏదో చెప్పటానికి సందేహిస్తున్న అతని పెదిమల అవస్థచూసి—

'ఫరవాలేదులే! చెప్పరా!' అన్న సత్యం మాటలు ఇలా చెప్పనిచ్చినయ్.

'మనం ఇలా 'టీ' కి వెళ్లే దోవలో ఓ ఎత్తరుగుల ఇల్లుంది — ఎప్పుడైనా చూశావా?'

'ఆఁ — ఔను — వుంది. అదేగా ఆ బాదం చెట్టూ......'

'ఆఁ — ఆఁ — అదే — అదే — మరి నువ్వెప్పుడైనా ఆ యింట్లో ఓ 'మెరుపు' ను చూశావా?'

సత్యం ఒక్కసారి ఉలిక్కిపడి-సర్దుకుని,

'దేహశుద్ధి కాగలదు — జాగ్రత్త రోయ్!' అని హెచ్చరించాడు.

'చెప్పేది వినవోయ్ ముందు. ఆ అమ్మాయిని మనం ప్రేమించాం—!'

'బాగానేవుంది — ఐతే' సాగదీసి అన్నాడామాటలు సత్యం.

'ఐతే వొచ్చిన చిక్కేమిటంటే ఆ అమ్మాయి నన్ను ప్రేమించేట్టు చేయాలి! మరి నువ్వు తెలివిగలవాళ్లలో ఒకడివిగా పరిగణించబడుతున్నావు గాబట్టి అపాయంలేని ఉపాయం ఏదైనా చెప్పాలి.'

'ఉపాయానికేం గానీ — మరి ఇహ ఈ పరీక్ష......'

'తప్పతానన్నా నీ భయం. ఆ భయం నాకేమీ లేదు. ఎందుకంటే ప్యాసవటానికి సులభమార్గాలు ఎన్నోవున్నయ్ కాబట్టి—'

'అవేమిటో చెపితే నాకూ ఈ చదివే బాధ వుండదుగా!' పరీక్ష ప్యాసవటానికి సంవత్సరం పొడుగునా చచ్చేట్టు చదివితేగాని, వీల్లేదనే భావంలోని వ్యంగ్యార్థాన్ని నిరీక్షణరావు గ్రహించి-

'వరసనే ఓపది సంవత్సరాల పేపర్లు గట్టిగా ఓసారి అన్స్వరుచేస్తే సరి! ఈ ఏడుమాత్రం అంతకంటేకొత్తవి ఎక్కణ్ణించి వొస్తయ్ కనక! వొకవేళ ప్రమాదవశాత్తూ—ఆ కొశ్చెన్సే రాక పోతే వుండనేవుందిగా బ్రహ్మాస్త్రం. పక్కవాడు తెలివైనవాడు పడాలేగానీ పరీక్ష ప్యాసవటం ఓ లెక్కలో విషయమా?'

నిరీక్షణరావు అన్నమాటల్లో సత్యానికి కొంతనిజంకనిపించకపోలేదుగానీ- ఐతే ఈ చదివేవాళ్లందరూ వొట్టి పిచ్చివాళ్లేనా? అనే ప్రశ్నరావటంతో నిరీక్షణరావు చెప్పిన మాటల్లోని పటుత్వం కొంత తగ్గింది సత్యంమనసులో...

ఈ విషయంగురించే ఇంకాలోతుగా ఆలోచిస్తూ నడుస్తున్న సత్యానికి వేడి, వేడి టీగ్లాసు తగలంగానే తెలిసింది- తను టీస్టాల్ దగ్గరకొచ్చినట్టూ - నిరీక్షణరావు టీ తాగుతూ తన చేతికిటీగ్లాసు అందించినట్టూ-!

* * *

'ఒక్కటే మార్గం కనిపిస్తోంది... దానికి మరినువ్వు కొంత శ్రమపడాలేమో!'

'కష్టేఫలే! కష్టం లేకపోతే ఏది మటుకు ఎలావొస్తుంది! చెప్పు అదేమిటో ప్రయత్నిస్తా!'

'అక్కడదీప స్తంభంవుంది చూశావూ అక్కడ నువ్వు కొన్నిరోజుల పాటు ఉద్యోగం చెయ్యాలి—ఏం? ఏమం టావు?'

'చిత్తం!'

'కొన్నాళ్లలా చేసిచూడు. ఫలితం చూసి మళ్లీ ఇంకో ప్లాన్ వేద్దాం ఇది కాకపోతే!'

సత్యం ఆజ్ఞప్రకారం నిరీక్షణరావు ప్రతిరోజూ అక్కడ-అంటే ఆదీపస్తంభం ఆ ఎత్తరుగుల ఇంటి కెదురుగా నిల్చొంటుండేవాడు. ఆ అమ్మాయి అరుగుల మీదికివొచ్చి అప్పుడప్పుడూ కాసేపు నిల్చుని పోతూ వుండేది. ఆ అమ్మాయి బైటికి వొచ్చినప్పుడల్లా కాలర్ సర్దుకోవటమో లేక పొడిదగ్గు దగ్గటమో ఏదో ఇలాటి శృంగార చేష్టలు చేసేవాడు.

ఏది ఎలావున్నా నిరీక్షణరావు ఈ ధ్యాసలో పడ్డాక సత్యం కొంత కాక పోతే కొంతైనా బాగు పడ్డాడనే చెప్పాలి. ఎందుకంటే సర్వసాధారణంగా నిరీక్షణరావు కాలమంతా ఆపరిసర ప్రాంతాల్లోనే గడపటంతో, సత్యంగది ఖాళీగా వుండటం వల్లనైతే నేమీ, ఏమీతోచకపోవటం వల్లనైతే నేమీ కాస్తో, కూస్తో చదువుతూనే వుండేవాడు.

రోజూ ఎప్పుడో ఒకప్పుడు నిరీక్షణరావు మొత్తానికి తను ఆనాడు చేసిన గొప్పతనాన్ని - దానివల్ల కలిగిన ఫలితాన్ని సత్యంముందు వెళ్లబోస్తూ వుండేవాడు. నిరీక్షణరావు ధోర్ని సత్యానికి ఓవిధమైన సరదా కాలక్షేపంగా జరిగి పోతోంది. నిరీక్షణరావు మాటలు వింటుంటే ఎంతో ఆశ్చర్యంగా అని పిస్తుంది సత్యానికి.

ఉదాహరణకి- నిరీక్షణరావు ఒక నాడు సత్యంతో తను ఆనాడు చేసిన కార్యక్రమాన్ని ఇలా వివరించాడు.

'ఈవ్వాళ నేను వాళ్ల అరుగుమీద కూర్చున్నాను. ఆ అమ్మాయి మామూలుగా వచ్చి పరధ్యానంలో నన్ను చూడక అవతలి అరుగుమీద పాపాయిని ఎత్తుకుని నిలబడింది. చీకటిపడగానే ఆ అమ్మాయి ఆ పిల్లతోపాటు 'చందమామ రావే!...' అంటూ చెయ్యి వూపుతూ పాడుతూ, మధ్యలో ఆ చెయ్యి నావేపు కూడా ఓసారి వూపింది. నేను కూడా అలాటిపని ఏదైనా చేదామని అనుకున్నా గానీ - మళ్లీ ఏంతంటూ వొస్తుందో అని ఊరుకున్నా......' అన్నాడు నిరీక్షణరావు సగం గెలిచి నట్లు.

'సరే బాగానేవుంది!' అని వాడు చెప్పినదంతా విని ఊరుకున్నాడు సత్యం.

* * *

నిరీక్షణరావు, సత్యంవాళ్లు వుంటున్న రూము ఒసన్నసందులోవుంది. ఆ సందు పొడుగు ఎక్కువే కానీ వెడల్పు అతి తక్కువ. దానికి తగ్గట్టు ఇటూ-అటూ భవనాలు ఆకాశాన్ని అంటుకుంటూ వుండటంచేత సూర్యచంద్రాదుల ప్రవేశం ఆసందులో కష్టమనే చెప్పాలి.

దేశానికంతకీ పౌర్ణమి ఐననాడుకూడా ఆసందులోవాళ్లకి అమావాస్యే. సామాన్యంగా జనసమ్మర్దం కూడా అంతగా వుండదు. ఎప్పుడో ఊళ్లోకి తెలుగుఫిలిం వొచ్చినప్పుడు- సినిమా వొదిలినవేళల్లో తప్ప - మిగతా కాలంలో ఎడారే...!

రోడ్డు పొడుగునా ఎలక్ట్రిక్ లైట్లు లేవుగానీ మ్యునిసిపాలిటీ కిరసనాయిలు దీపాలున్నాయ్. అవైనా రాత్రి 9½-10 గం॥ లకే నిద్రపోతయ్. కనుక సామాన్యంగా గాడాంధకారంగానే వుంటుం దనే అనవలసొస్తుంది.

నిరీక్షణరావుకి చెప్పుకోదగ్గ వీలు ఏమిటంటే ఆ అమ్మాయి ఇల్లుకూడా ఆసందులోనే వుండటం!

నిరీక్షణరావు నిశాచరుడు. గనుక ఓచిన్న బ్యాటరీలైటువుంది. దీనికాంతి ఎప్పుడుచూసినా అవసాన దశలోనే వుంటుంది. అదివాడికి ఎందుకంటే మరీ అమావాస్య రాత్రి చీకట్లో నుక్కుల్ని తొక్కి అపాయం కలగకుండా వుండ టానికి మాత్రమే!

* * *

ఓనాడు రాత్రి షుమారు 10 గంట లకు సత్యం, నిరీక్షణరావు రూమునుంచి టికి బయల్దేరారు.

కొంత దూరం నడిచాక-

'అదిగో! అదే ఆ ఎతరుగుల ఇలు!' అన్నాడు నిరీక్షణరావు.

'ఔ న్లేనోయ్! నాకూ తెలుసు!.' అని సత్యం అన్నాడు. అంటే తెలియంది ఇంకోటేదైనా చెప్పమని...

ఆ ఇంటిని సమీపించాక నిరీక్షణ రావు తెల్లబోయి, ఆశ్చర్యంతో విచారాన్ని రంగరించి మొఖానికి రాసు కున్నట్టు మొఖంపెట్టి-

'అరె! ఇంటో లైట్లన్నీ ఆర్పేసి వున్నయ్యే ఇవ్వాళ-ఎందుకనో! రోజూ ఈ వేళకి దివ్యంగా వెలుగుతుండేవి- దోవన పోయేవాళ్లకి సరైన మార్గం చూపిస్తూ...!' అన్నాడు.

నిరీక్షణరావుని ఏడిపించటానికి సత్యం-

'ఏదైనా వూరు వెళ్లిందేమో!' అన్నాడు నవ్వుతూ!

'అబ్బె! ఆ ప్రయత్నా లేవీలేవే నిన్నటిదాకా!' అన్నాడు నిరీక్షణరావు.

'లేకపోతే ఇల్లు మారిందేమో ఖర్మ! బహుశా అంతే జరిగుండొచ్చు!' ఎంతో నమ్మకంగా అనిన ఈ సత్యంమాటలు విని నిరీక్షణరావు నిరుత్సాహంగా, ఆఇంటి వైపేచూస్తూ విచారంగా ఆఇల్లు దాటాడు.

నిరీక్షణరావు విచారానికి సానుభూతిగా సత్యం ఒక్క నిమిషం నిశ్శబ్దంగా నడిచాడు.

సందుచివర కొచ్చారు. దూరాన్నుంచీ ఎవరో వొస్తున్నట్టుగా గ్రహించిన నిరీక్షణరావు బ్యాటరీలైటు, ఎవరో చూడాలమని తలెత్తింది!

నిరీక్షణరావు మనను సంతోషంతో ఒక్కసారి గంగింది అవ్యక్తిని చూడ గానే! అతి దగ్గరబంధువు మాదిరిగా అవస్థపడ్డాడుగానీ, నిరీక్షణరావు పెది

మలు సమ్మెచేసినయ్.

ఆమె! ఇంకా సందేహ మెందుకు- ఈ-వెంటనే-మనసు ముందుకు వొంగింది కాని సత్యం, మనిషిని వెనక్కి లాగి పట్టుకోవటంవల్ల...

ఆమె పెదిమల కదలికను చూసిన నిరీక్షణరావుకళ్లు వెంటనే మెదడుకి ఆ వార్తని అందివ్వ లేకపోయినయ్. కారణం ఇంకోపనిలో దీర్ఘంగా మునిగివుండడమే!

'చీకటిగా వుంది. శ్రమ అనుకోక పోతే, ఈ సందు చివరిదాకా దిగబెడితే కృతజ్ఞురాల్ని!-'

ఎంతో విశ్వాసంగా పనిచేసే నిరీక్షణరావు చెవులు-అతిచురుకుగా పనిచేద్దామని ప్రయత్నించి- అన్నిమాటలూ ఒక్కసారే విందామని ప్రయత్నించటం నిరీక్షణరావుకి కొంత ప్రమాదంగా పరిణమించింది-

వెంటనే తేరుకుని, 'ఏమిటి అంటున్నారు?' అన్నాడు నిరీక్షణరావు.

'నన్ను ఇంటిదాకా......'

'ఓ దానికేం భాగ్యం. మాఇల్లూ అక్కడేగా- రండి!!'

నిరీక్షణరావు '...కలాపం' చూసి సత్యం ఏమనుకొన్నాడో ఏమోగానీ 'ఐతే నేనలా 'మొదటిరాత్రి'కి వెళ్లొస్తారా!' అన్నాడు.

సత్యంచేసిన త్యాగాన్ని నిరీక్షణరావు మనసులో అభినందించినా, పైకిమాత్రం కొంచెం ఫీలయినట్టు నటించాడు.

ఇందాకటినుంచీ వీళ్లుమాట్లాడు కొంటున్న మాటలు విన్నట్టు - నిరీక్షణరావు కాళ్లు మాట్లాడకుండా వెనక్కి నడిచినయ్.

*   *   *

తలుపు చప్పుడువిని - అర్ధకొంప కనక వెంటనే తియ్యకపోతే-జరిమానా వసూలు చేయబడగలదని, వెంటనేతెచి తీశాడు నిరీక్షణరావు.

చిరునవ్వుతో చిందులాడుతున్న సత్యం మొఖం-కనుబొమ్మలు ముడుచుకొనివున్న నిరీక్షణరావు మొఖానికి జవాబుగా- ఓసరవెల్లి రంగుమార్చినట్టు - ఆశ్చర్య సూచకంగా ఒక్కసారి వెడల్పై మళ్లీ వెంటనే పీలైనంత చిన్నదిగా ముడుచుకుంది.

నిరాదరంగా ఒకమూల పారవేయబడిన బ్యాటరీలైటు, సత్యంచేతిలో కెక్కి అనువుగా కూర్చొని, సత్యం చేతిబలం అండగా తీసుకొని నిరీక్షణరావు మొఖంకేసి ఎగతాళిగా ఫక్కున నవ్వింది!

నిరీక్షణరావులో చైతన్యాన్ని చూడని సత్యం 'దవడకుర్తి' జరిగే వుంటుందని నిశ్చయించుకుని ఏదో అడగబోతూండగా - నిరీక్షణరావు మనసులో ఏమనుకొన్నాడో ఏమో గానీ స్వరం హెచ్చించాడు...

'Newton's third law : to every action, there is an equal and opposite reaction!' అదేమళ్లీమళ్లీగట్టిగా చదువుతూండటం చూసిన సత్యం - 'నిజం! నిజం!!' అన్నాడు.

బాధపడలేక 'ఏమిటి నీ మొఖం నిజం?' అన్నాడు విసురుగా నిరీక్షణ రావు.

'Newton's third law!' అన్నాడు సత్యం నిస్సంకోచంగా వెంటనే!

'పిచ్చివాగుడు వాగకుండా- చదువు కుంటే చదువుకోవటమో లేకపోతే పడుకోవటమో చేయక ఏమిటీగొడవ?' విసుగ్గా అన్నాడు నిరీక్షణరావు.

'అది సరేలే! పోనీ నేటికైనా పిచ్చి కుదిరినందుకు సంతోషిస్తున్నా! ఇంతకీ అసలుసంగతి చెప్పవేం? కుదరలేదా జోడా?'

'పదిహేను రూపాయిలిస్తే నీకైనా కుదుర్తుంది!'

'ఆc- ' ఆశ్చర్యంగా-కళ్లూ-నోరూ వీలైనంత పెద్దవిగాచేసాడు సత్యం. అంతకంటే ఏంచేయాలో తోచలేదు సత్యానికి.

'2 అయింది- పడుకోండి' అన్నట్టు గడియారం అలారం కొట్టింది-

కోపంతో చిరాగ్గా నిరీక్షణరావు గడియారం నెత్తిన మొట్టాడు.

నిరీక్షణరావుకి కోపం వచ్చిందని గ్రహించి గడియారం నోరుమూసు కుంది. నిరీక్షణరావు చదివాడు '...to every action there is an equal and opposite reaction!' అని.

—♦—

